క్లుప్తంగా

మన్నేపల్లి నరసింహుని ఆదాయం రూ.6.78 లక్షలు

బొల్లాపల్లి : శ్రీమన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆదాయం ఈ ఏడాది కొంత పెరిగిందని దేవదాయ శాఖ అధికారి ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ఏడాది రూ.6.68 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.6.78 లక్షల మేర ఆదాయం సమకూరిందని వివరించారు. విరాళాలు రూ.2.17 లక్షలు, హుండీ ఆదాయం రూ.1.65 లక్షలు, కొబ్బరికాయలకు రూ.1.25 లక్షలు ఇతరత్రా కలిపి మొత్తం ఆదాయం రూ.6.78 లక్షలు వచ్చిందని ఈవో వివరించారు.

శివయ్య కల్యాణం



వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో హిమాలయ గురువు ఆశీస్సులతో శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి బృందావనంలో మహాశివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు జాగారాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పెండేల వెంకటమోహన్‌రావు, కె.అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామాలకు చేరిన ప్రభలు



నాదెండ్ల: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి చేరుకుని తిరిగి గురువారం భారీ విద్యుత్ ప్రభలు స్వగ్రామాలకు ప్రశాంతంగా చేరాయి. సాయంత్రం 6 గంటల సమయానికి అప్పాపురం , అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభలు ఎలాంటి ఆటంకాలు లేకుండా తిరిగి చేరటంతో ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో రెండు ప్రభలకు గ్రామోత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది వ్యయం పెరిగిందని నిర్వాహకులు చెప్పారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం గుర్తింపు



నరసరావుపేట రూరల్: మండలంలోని కోటప్పకొండ, కొండకావూరు పంచాయతీలోని సర్వ శిక్ష అభియాన్ స్కూల్ ఎదురుగా గురువారం సుమారు 50 నుంచి 55ఏళ్ల వయస్సు గల ఒక మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ కిషోర్ తెలిపారు. చిత్తు కాగితాలు, వాటర్ బాటిల్స్ ఏరుకుని జీవించే మహిళగా స్థానికులు చెబుతున్నారని, ఆ మహిళ చిరునామా తెలియ రాలేదని, ఆమె ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్‌ఐ 9440796244, 944079622 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు



మాచర్ల: స్థానిక స్వామి వివేకానంద ఆశ్రమంలో యోగా మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. నెలరోజుల పాటు మాచర్ల రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులోని ఆశ్రమంలో.. ఆశ్రమ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ భారతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా ప్రధాన భాగమన్నారు. యోగా వల్ల మానసిక సమస్యలను అధిగమించవచ్చన్నారు. యోగా ప్రయోజనాలు వివరించారు. మార్చి 3 నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. యోగ ఉచిత శిక్షణలో పాల్గొనాలనుకునేవారు పేర్లు నమోదు చేసుకోవాలని మెట్టుగోవిందరెడ్డి సూచించారు. వివరాలకు 94400 06813కు సంప్రదించాలన్నారు.



నరసరావుపేటలో ఓటు వేస్తున్న గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ



ఓ వికలాంగ పట్టభద్రుడిని ఓటు వేయించి బయటకు తీసుకొస్తున్న స్థానికులు



మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఓటువేసేందుకు లైనులో నిల్చున్న ఓటర్లు



రొంపిచర్లలో క్యూలో నిలిచుని ఉన్న పట్టభద్రుల ఓటర్లు



యడ్లపాడు పోలింగ్ కేంద్రం వద్ద అధికారుల పర్యవేక్షణ

పట్టభద్రుల సిరాశాసనం



చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

- దొంగ ఓట్లు వేసిన కూటమి అనుకూల వర్గాలు
- దొంగ ఓటర్లను ప్రశ్నించినందుకు సీఐటీయూ నాయకుడిపై దాడి
- పోలింగ్ బూత్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన ఎమ్మెల్యే చదలవాడ
- అనుమతించని పోలీసులు, అధికారులు
- ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు



నాదెండ్ల హైస్కూలులో బారులు తీరిన ఓటర్లు.. చిత్రంలో ఓటు వేసి తిరిగి వస్తున్న చంటిబిడ్డ తల్లి

నరసరావుపేట: కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కొన్ని చెదురుమదురు ఘటనలు మినహా నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. కొన్నిచోట్ల వామపక్ష, ప్రజాసంఘాల నేతలు ప్రతిఘటించారు. బరంపేట హైస్కూలు 376వ బూత్‌కు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన వారిని ప్రశ్నించినందుకు సీఐటీయూ నాయకుడు కొమ్ముల నాగేశ్వరరావుపై కూటమి వర్గీయులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన అనుయాయులతో మున్సిపల్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలోకి ఓటింగ్ ముగిసే సమయంలో చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రైనీ డీఎస్పీని చేతితో నెట్టుకుంటూ లోపలికి వెళ్లేందుకు ఎమ్మెల్యే యత్నించారు. దీంతో పోలీసులు బలవంతంగా బయటకు పంపి తలుపులు మూసేశారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలతో ముగించారు. ఎమ్మెల్యే అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలానితోపాటు పలువురు పట్టణ ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలుత మొదటి మూడు గంటలు మందకొడిగా సాగిన పోలింగ్ 11 గంటల నుంచి ఊపందుకుంది. ఎన్నికల ప్రక్రియను కలెక్టర్ పి.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఆర్డీవో కె.మధులత పరిశీలించారు.

రొంపిచర్లలో 65శాతం పోలింగ్

రొంపిచర్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల ప్రక్రియను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. పోలింగ్ సరళిని నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఫణికృష్ణ, తహసీల్దార్ బి.నిర్మల పర్యవేక్షించారు. మధ్యాహ్న సమయంలో టీడీపీ నాయకులు అక్రమంగా చొరబడి రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణ రావు పోలింగ్ ఏజెంట్లు ఆరోపించటంతో టీడీపీ, పీడీఎఫ్ ఏజెంట్ల మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు 100కి పైగా దొంగఓట్లు వేశారని పీడీఎఫ్ నేతలు ఆరోపించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సర్దుబాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 1228 ఓటర్లకు గాను, 809 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 65శాతం పోలింగ్ జరిగింది.

బొల్లాపల్లి మండలంలో 77 శాతం

బొల్లాపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో 1091 ఓట్లకు గాను 840 ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. మండలంలో వెల్లటూరు, బొల్లాపల్లి, రావులాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లోని పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 77శాతం పోలింగ్ నమోదైనట్టు వివరించారు.

యడ్లపాడులో 81.7శాతం..

యడ్లపాడు: యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. 1,085 మంది పట్టభద్రుల ఓటర్లకుగాను 887 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 81.7శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్‌ను యడ్లపాడు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి.హేమలతాదేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి శశికళ, వీఆర్వోలు కేపీచారి, షేక్ రఫుల్లా పరిశీలించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

నాదెండ్ల మండలంలో 89.71 శాతం

నాదెండ్ల: నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. కూటమి నేతలు రెండు పోలింగ్ కేంద్రాల వద్ద హడావుడి సృష్టించారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రలోభాలకు తెరలేపారు. మొత్తం 1614 ఓట్లకు గాను 1448 ఓట్లు పోలయ్యాయి. 89.71 శాతం పోలింగ్ జరిగింది. ఏఈఆర్వో, తహసీల్దార్ ఏవీ రమణ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. మధ్యాహ్నం మండే ఎండలోనూ ఓటర్లు క్యూలైన్లలో నిలబడ్డారు. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు.

అధికారపార్టీ ఆగడాలు

- ఇతర అభ్యర్థుల ఏజెంట్లపై దౌర్జన్యకాండ
- చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలైన ఓట్లు 6,898



ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: అధికార పార్టీ నాయకుల ఆగడాలు, ఇతర అభ్యర్థుల ఏజెంట్లపై దౌర్జన్యకాండ, ఏజెంట్లను బయటకు నెట్టివేయడం, దుర్భాషలాడటం వంటి ఘటనల నడుమ కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ముగిసింది. కూటమి పార్టీల నాయకులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. వీరికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వంతపాడారు. పదేపదే పోలింగ్ స్టేషన్లలోకి వస్తూ ఓటర్లను ప్రభావితం చేసే యత్నం చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరుపున ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించడంతో ఆయనపై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలోనే అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులు కురిపించారు. దీనికి తోడు పట్టణ పరిధిలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ బూత్ నంబర్ 384లో ఎన్నికల ఏజెంట్లుగా ఉన్న పేరుబోయిన వెంకటేశ్వర్లు, పేరుబోయిన భారతిలను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు గెంటివేశారు. దీంతో వారు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వారు జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా మధ్యాహ్నం మూడు గంటల అనంతరం పోల్ కాని ఓట్లను గుర్తించి దొంగ ఓట్లు వేసేందుకు అధికార పార్టీ నాయకులు తెర తీశారు. చిలకలూరిపేట పట్టణ పరిధిలో మొత్తం 4,782 ఓట్లు ఉండగా, ఇందులో 3,403 ఓట్లు పోలయ్యాయి. 89.36 శాతం పోలింగ్ నమోదైంది. చిలకలూరిపేట నియోజకవర్గం మొత్తం మీద 8,779 ఓట్ల ఉండగా 6,898 ఓట్లు పోలయ్యాయి. 82.98 శాతం ఓటింగ్ నమోదైంది.

జేసీ పరిశీలన



శావల్యాపురంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జేసీ సూరజ్

శావల్యాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగినట్లు శావల్యాపురం మండలం 366 పోలింగ్ కేంద్రం అధికారి బాల వెంకటేశ్ గురువారం తెలిపారు. మండలంలో 658 ఓట్లు ఉండగా 612 ఓట్లు పోల్ అయినట్లు వెల్లడించారు. 93 శాతం పోలింగ్ నమోదైనట్టు వివరించారు. పోలింగ్ తీరును జాయింట్ కలెక్టరు సూరజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వీఆర్వోలు ఉప్పులూరి చిన మంగయ్య, నరసింగరావు తదితరులు ఉన్నారు.

దొంగ ఓట్లు వేయించడం హేయమైన చర్య



కూటమి నేతల తీరును ఖండిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి మోహన్‌చందు, నేతలు

శావల్యాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ దొంగ ఓట్లు వేయించటం హేయమైన చర్య అని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చందు మండి పడ్డారు. గురువారం శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ పారదర్శకంగా జరగలేదని విమర్శించారు. ఆయనతో పాటు యూటీఎఫ్ నాయకులు మాదాల రామ కోటేశ్వరరావు, పాపసాని సురేష్, గణపర్తి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నూజెండ్లలో 87 శాతం ఓటింగ్



నూజెండ్లలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దారు రమేష్ కుమార్

నూజెండ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు పోలింగ్ అధికారి మద్దికుంట సాంబశివరావు తెలిపారు. 1,011 మంది ఓటర్లు ఉండగా 870 ఓట్లు పోల్ అయినట్టు వివరించారు. పోలింగ్ శాతం 87గా నమోదు అయినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్ పరిశీలించారు.

వినుకొండలో ఓటింగ్ ప్రశాంతం



వినుకొండలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే వీరపనేని యలమందరావు

వినుకొండ : వినుకొండ నియోజకవర్గంలో మొత్తం 7,660 ఓట్లు ఉండగా 5,981 ఓట్లు పోలై 78.08 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో నాలుగు బూత్‌లలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని నరసరావుపేట ఆర్డీవో మధులత పరిశీలించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జునరావు, వీరపనేని యలమందరావుతోపాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వందే.. శివం శంకరం

యడ్లపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యడ్లపాడు మండలంలోని శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. లింగారావుపాలెంలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరరావు దేవస్థానం, యడ్లపాడు రాజరాజశ్వర స్వామి ఆలయం, బోయపాలెం హరిహరక్షేత్రం, జాలాది హరిహరదత్తక్షేత్రం, మైదవోలు, కొత్తపాలెం, కొండవీడు, తుర్లపాడు, దింతెనపాడు, జగ్గాపురం, కారుచోల, సొలస, సందెపూడి గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం నుంచి ఉపవాసాలు ఉన్న భక్తులు సాయంత్రం శివాలయాల్లో మహాశివునికి, పార్వతిదేవి అమ్మవారికి జరిగిన శాంతి కల్యాణ వేడుకలను తిలకించి తరించారు. బుధవారం రాత్రి లింగోద్భవ కాలంలో 12 గంటల నుంచి ఆదిదేవుడికి రుద్రాభిషేకంతో ప్రారంభించి 11 రకాల అభిషేకాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రంతా భక్తులు జాగారాలు చేశారు. వందే శివం శంకరం అంటూ నినదించారు.



యడ్లపాడు మండలం లింగారావుపాలెం శివాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాశివుడు

కూటమి నేతల కుతంత్రాలకు చెక్

మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు డబ్బులు, అధికార బలంతో ఓట్లు వేయించుకునేందుకు నానా తంటాలు పడ్డారన్నారు.
పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును ఓడించేందుకు అన్నిరకాల ప్రయత్నాలు కూటమి నేతలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, వెంకట్రావు తదతరులు ఉన్నారు.

కోటప్పకొండలో రెడ్‌క్రాస్ సేవలు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వచ్చిన యాత్రికుల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమచికిత్స కేంద్రం, అంబులెన్స్‌ను ఏర్పాటుచేసి సేవలు అందించినట్టు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి తెలిపారు. మెట్ల మార్గం, కాలినకడన వచ్చిన భక్తులకు 120 మందికి, జ్వరం, నీరసంతో బాధపడుతున్న 700 మందికి వైద్య శిబిరంలో చికిత్స అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఆలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు విష్ణు, అక్షయ్, అఖిల్, శ్రీహరి, ఆనంద్, ప్రణవ్, ఆశిక్, అద్వైత్‌లు వైద్య శిబిరంలో సేవలు అందించారని వివరించారు.



వైద్య శిబిరం వద్ద రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్‌లో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఎంతో మహిమ కలిగిన సాయిబాబాని పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అనేక గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సాయినాథుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. పాలువాయిగేటు గ్రామానికి చెందిన దారపునేని చెన్నయ్య, ఉమాదేవి దంపతులు భక్తులకు అన్న సంతర్పణం చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కన్నెగంటి హనుమంతును స్ఫూర్తిగా తీసుకోవాలి



రెంటచింతల: పల్నాటి స్వాతంత్ర్య ఉద్యమకారుడు, 'పుల్లరి' నిరాకరణ పోరాటయోధుడు కన్నెగంటి హనుమంతును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ పేర్కొన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మోహన్ మాట్లాడుతూ కన్నెగంటి హనుమంతు పల్నాడు ప్రజలు పుల్లరి పన్ను కట్టకుండా చేశారని కొనియాడారు. బ్రిటీష్ పాలకులు నిజాయితీపరుడు, శౌర్యవంతుడైన హనుమంతును 26 రౌండ్ల కాల్పులు జరిపి అంతమొందించారన్నారు. విద్యార్థులు, యువకులు హనుమంతును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాదె లూర్దు మర్రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

